# లోటా.

చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు

"అన్నన్నా! యెంతకష్టమెంతకష్టము? ప్రతి దినము సాయంకాలమునందు పది మందితో గలసి త్రాగి నవ్వుచు ప్రేలుచు మహానందసముద్రమున తేలియాడునట్టి నేను, స్నేహితులమాటయటుంకనిచ్చి, స్వయముగానైన త్రాగుటకు నాలుగణాలైన చిక్కవుగదా! ఛీ! దిక్కుమాలిన బ్రతుకెందుకు? పావులా డబ్బులైన దగ్గఱలేనివాడు జీవింపగూడదు. ఎవ్వరినైన నప్పడుగుదమన్న నిన్నమొన్న నాడిన జూదములో నే నోడిపోయి స్నేహితులకు బాకీపడితిని. నోరుతెరచియడిగిన లాభమేమి? వారు నా కప్పీయకపోవుటయేకాక కింటబడగానే జుట్టుదొరకపుచ్చుకొని జూదపుబాకి తెమ్మని బాధింతురు. ఇల్లువాకిలి యమ్ముకొని చెడత్రాగి పాడైనవానికి గ్రామములో మఱియెవ్వరు ఋణమిత్తురు? చేతిలో డబ్బు పుష్కలముగా నున్నప్పుడు షాపులలోనికి బోయి బ్రాంది, విస్కీ, మొదలైన మంచిమంచి సీమసారాలు త్రాగి హాయిగా గాలక్షేపము చేసితిని. డబ్బు తక్కువైనతరువాత సామాన్యపుసారాయితోనే తనివిజెంది యుంటిని. అదికూడ నేడు కరవైనది. రెండు శేర్ల కల్లునీళ్ళయిన లోపలపోయుదమన్న రెండణాలడబ్బులైనాలేవు. సూర్యాస్తమయమైనది. పక్షులు గూండ్లు చేరుచున్నవి. నేను సారాదుకాణము చేరలేకపోతిని. నామనసులో బెంగవలెనే చీకటి నాలుగుదిక్కుల గ్రమ్ముచున్నది. కాళ్ళు పీకుచున్నవి. చేతులు లాగుకొనిపోవుచున్నవి. కల్లుగాని సారాగాని గడగడ త్రాగునట్టిభాగ్యము నేడు నాకు కలుగునాయని మనస్సు సందేహపడుచున్నది. నామనస్సులో నుత్సాహము జారిపోయినట్లే సూర్యబింబము క్రమక్రమముగా జారిపోయినది. ఆడవాండ్ర మెడలలోనున్న వస్తువు లేవైన తెంపుకొందమన్న నీగోదావరియొడ్డున వేసవికాలముగుటచే జల్లగాలికి జను లనేకులు వచ్చి తిరుగుచున్నారు. ఆపనిచేయుటకు వీలులేదు. ఇండ్లలో దూరి గిన్నె చెంబు, తపేలా, మొదలైనవస్తువులు సంగ్రహించిపోవుదమన్న గొప్పవారియిండ్లకడ నౌకర్లు కావలియుందురు. పేదవాండ్రయిండ్లలో నేమి దొరకవు. నేడేమిచేయుటకునాకు దోచకున్నది. అయినను చిరకాలమునుండి నాసొమ్ముతిని కడవలకొలది కల్లు సారాయి నాకు పోసినగమళ్లగంగన్న దగ్గఱకు బోయి కల్లుగాని సారాయిగాని నాకరువుపోయుమని వేడుకొనియెదను. వాడు నాకింతమాత్ర ముపకారము చేయకపోవునా? వెనుక రెండుమూడుసారులు వాడు నాకరువు పోసినపుడు నేను సొమ్ము నాలస్యముగా నిచ్చితినని నామీద మండిపడి యిష్టమువచ్చినన్ని కేకలు వైచి తూలనాడినాడు. అరువుపోసినదాక నమ్మకము లేదు. లేకపోయిన నేమి?

అడిగినందువలన నష్టమేమి?"అని తలపోయుచు నొక త్రాగుబోతు రాజమహేంద్రవరము గోదావరియొడ్డున నొకనాడు సంధ్యాకాలమున నిట్టట్టు తిరిగితిరిగి తనమనోనిశ్చయముననుసరించి యచ్చోటు విడిచిబయలుదేరి రంగిరీస్‌పేట మీదుగా తనమనోరథము తప్పక నెఱవేరునని పుట్టెడాసతో దన ప్రాతచెలికాడైన గమళ్ల గంగన్నను దర్శింపబోయెను. ఆసమయమున గడ్డంగిదగ్గరనున్న సందడి యేమనివర్ణింపను? తెగత్రాగుటచేత నాలుక కొఱుగుబోయి సరిగా మాటలాడజాలనివారు కొందరు; ఒడలుతెలియక యొండొరులతో లేనిపోనికయ్యములు కల్పించుకొని నోట నుచ్చరింపగూడని బంకబూతులు తిట్టుకొనుచు ఫెడీలుఫెడీలుమని దండదెబ్బలు కొట్టుకొనుచు ముందుకు వెనుకకు నూగుచు కలియబడి కొట్టుకొనువారు కొందరు; కట్టుకొన్నబట్ట లూడిపోవ నేలబడి పొరలాడుచు ప్రక్కను దాచిపెట్టుకొన్నబుడ్డి చేతులతో నెత్తి మఱలమఱల ద్రాగువారు కొందరు; జందెములు బొడ్డులో దోపుకొని కన్నులుమాత్రమే యగపడునట్లు ముసుగులు వైచికొని పెడమొగములు పెట్టి కంఠధ్వనులు మార్చి గమళ్ళగంగన్న చేతిలో డబ్బులు సీసాలు పెట్టునగ్రవర్ణములవారు కొందరు. ఒకడు త్రాగినంత త్రాగి శరీర మెఱుగక తనదగ్గర నున్నడబ్బులు బేసకాసులు పై కెగురవైచెను. చుట్టుప్రక్కల నున్నవారందఱు డబ్బులు, నాణెములు తీసికొని వానిని మరల గంగన్నకే సమర్పించిరి. కొందరు త్రాగుటకు డబ్బుదొరకక పోవుటచే నేమియు తోచక కాలుగాలిన పిల్లులవలె నిట్టట్టు తిరుగుచు గడ్డంగికి బ్రదక్షిణముచేయుచు ధనము కలిగి త్రాగి తుళ్లుచున్న ధన్యాత్ములనుచూచిలొట్టలువేయుచు మిక్కిలి దీనభావముతో నితరులను బదులడుగుచు ఋణము దొరకనప్పుడు గొప్పయాశాభంగముచేత నుస్సురనుచు నిట్టూర్పులు విడుచుచు తమయదృష్టహీనతను నిందించుకొనుచుండిరి. ప్రాతబాకీలు చెల్లింపనందున గొందరు గంగన్నచేత తలవాచునట్లు చీవాట్లు దినుచుండిరి. ఈసమయములో నీకథానాయకుడగు త్రాగుబోతు గిడ్డంగిచేరి యచ్చట పరవశులై పడియున్న పురుషుల జూచినాడు. తన కట్టి భాగ్యము కలుగనందుకు మిక్కిలి చింతించి మెల్లమెల్లగా గంగన్నకడకు బోయి మిక్కిలి వినయముతో జేతులు నలుపుకొనుచు నాతని యెట్టయెదుట నిలుచబడి "గంగన్నా!" అని మెల్లగా పిలిచెను. పనితొందరచేత గంగన్న వినిపించుకొనలేదు. ఆకలిగొన్నవాడు వంటయిల్లు జేరునపుడును, త్రాగుబోతు గిడ్డంగి జేరునపుడును వానియాత్రము చెప్పనలవియగునా? త్రాగుబోతుగంగన్నను మఱిరెండుసార్లుగట్టిగా బిలిచెను. గంగన్న 'యెవరు వా'రని తిరిగిచూచి,"దామోదరయ్యగారా! యేది? మీకాయ తెచ్చినారా?" యని యడిగెను. ఆమాటలు వినగానే దామోదరయ్య" గంగన్నా! యీగోజున డబ్బు దొరకలేదు. నే దరువుపోసినవా యీవేళటిసొమ్ము రేపటిసొమ్ము రేపుతెచ్చి యిచ్చెద"నని పలికెను."చాలుచాలులేవయ్యా! నీమాట నీళ్లలోమూట. వెనుక రెండుమూడుసారులు నీకరువుపోసితిని. ఆడబ్బు త్రిప్పి త్రిప్పి


యిచ్చినావు. అడిగినప్పుడు కోపము. కంటి కగపడవు. డబ్బులు గట్టిగా తెమ్మని యడిగినపుడు చేపలబజారుదగ్గరనున్న కొట్టుకు బోదువు. నేను నీకరువుపెట్టను. పో!" యని గంగన్న వానికోరిక నిరాకరించెను. దామోదరయ్య మిక్కిలి దీనభావముతో వాని ననేకవిధముల బ్రతిమాలెను. 'ఇవి చేతులుగావు కాళ్లుసుమీ' యని వాని రెండుచేతులు బట్టుకొనియెను. గడ్డము బట్టుకొనియెను. 'మరునాడు తప్పక డబ్బిత్తు'నని యెన్నోయొట్లు పెట్టికొనెను. ప్రమాణము చేసెను. ఈ ప్రమాణములు శపథములు గంగన్నమనస్సు కరగింపజాలకపోయెను. చేయునదిలేక దామోదరయ్య సారాపాక విడచి యావరణములోనికివచ్చి మెల్లగా వీధిలోనికి రాబోవుచుండ త్రాగిన యీడిగవాడొకడు వచ్చి యతనిజుట్టు పట్టుకొని "నిలు నిలు. నాదగ్గఱ నీవుపుచ్చుకొన్న చీకులకు నా కీయవలసిన యారణా లెగబెట్టి తిరిగి కనబడకుండ పోయినావుగదా! నా సొమ్మిచ్చి మఱి కదలు. కమ్మకమ్మగా చీకులమాంసము నీయబ్బసొమ్మని తిన్నావా? నీతాతసొమ్మని తిన్నావా? నాసొమ్మిప్పుడు కక్కించెదను. కదలనియ్య" నని యఱచుచు వానిగమనము నిరోధించెను. వాడు తప్ప త్రాగియుండుటచే వానిదేహము కంపింపదొడగెను. మాట కొణుగుగా వచ్చుచుండెను. అదియెఱిగి దామోదరయ్య వాని నొక్కత్రోపు త్రోసి కాలికొలది పరుగెత్తెను. వాడు గుభాలున నేలబడి వానివెంట బరుగెత్త సత్తువలేక నోటికివచ్చినట్లు తిట్టజొచ్చెను. దామోదరయ్య పిక్క బలముతో పరుగెత్తి వగర్చుచు మేనినిండ చెమట గ్రమ్మ గోదావరియొడ్డుచేరి మెల్లగా మెట్లు దిగి నదిలో జేతులు కాళ్లు మొగము కడుగుకొని నాలుగుపుడిసెళ్ల నీరు త్రాగి మఱల గట్టెక్కి యారాత్రి సారాద్రాగుటకు సాధనమేమని యేకాగ్రచిత్తముతో నాలోచించుచు మఱల నిట్టట్టు దిరుగసాగెను. తిరిగితిరిగి యతడు దక్షిణమువైపున నెట్టురాళ్లదిబ్బమీద నున్న తులసీదాసుబావాజీయొక్క పాకసమీపమున కరిగెను. అప్పుడు రెండుఘడియల రాత్రి యయ్యెను. చీకటిపడెను. గోదావరియొడ్డున జనసంచారము విరళమయ్యెను. ఆ పాకలో నొకమూల నగ్ని, గుండమునందు మండుచుండెను. దానియెదుట బావాజీ కూర్చుండి జపము చేసికొనుచుండెను. తులసీదాసుబావాజీనిగురించి నాలుగుమాట లిచ్చట చెప్పుట యనావశ్యకము కాదు. అతని నివాసస్థాన మేదియో యెవ్వరికి దెలియదు. హిందీభాష తఱుచుగా మాట్లాడుటచేత నతడుత్తరహిందూదేశనివాసియని పౌరు లూహించిరి. వారియూహ సరియైనదే. అతడు పచ్చగ దబ్బపండువలె నుండును. కాయము దీర్ఘమైనది. కాని యుపవాసములచేతను, నియమితాహారములచేతను, వానిశరీర ముండవలసినలావుగా నుండక కృశించియుండును. తలపై చిరకాల ప్రవర్ధమానములైన తెల్లనిజడలు మఱ్ఱియూడలవలె వ్రేలుచుండును. పలువెండితీగలు గుదిగ్రుచ్చినట్లు గడ్డము తెల్లనై నాభిపర్యంతము వ్యాపించియుండును. కనుబొమ్మలమీఁది వెండ్రుకలు కూడ నఱసియుండుటచే నతడు రమా

రమి యెనుబదిసంవత్సరముల వయస్సుగల వాడని కొందఱు, సహస్రమాసములుగడచిన వని కొందఱు పలుకుచుందురు. ఆయన పండ్లు పాలు, దుంపలు, గోధుమరొట్టెలు మొదలగు వానిని భక్షించి దేహధారణము చేసికొనును. ప్రతిదిన మెవ్వరో యొకరు ఆయనకుగావలసిన యాహారము భక్తిపూర్వకముగా గొనివచ్చి నమస్కరించి సమర్పించుచుందురు. ఎవ్వరు సమర్పింపకపోయినను నోరుదెఱచి యడుగడు. ఒకటిరెండుసారులు వారు దెచ్చెదరని వీరు వీరు తెచ్చెద రని వారు తలంచి యమ్మహాత్మున కాహారము పురజనులు సమర్పింపకపోయిరి. ఆ రెండుదినములు పావనములగు గౌతమీజలములతో నుదరపూరణము జేసికొని యా యోగి యెప్పటివలె గాలక్షేపము చేసెనేగాని తనయాకలిబాధ నెవ్వరి కెఱిగింపలేదు. తఱుచుగా నతడు సమాధిలో నుండును. తనయగ్నిహోత్రమునెదుట కృష్ణాజినము పఱచుకొని పద్మాసనస్థుడై యా పరమయోగి కన్నులు మూసుకొని పరమధ్యానతత్పరుడై యుండగా నతనిని జూచినవారు తప్పక యతడు మహాయోగియని తలంపకపోరు. సాయంకాలముల యందతడు తనపాకలోనుండి వెలుపలికి వచ్చి కూర్చుండి పురజనులతోను దూరమునుండి వచ్చు బైరాగులతోను సంభాషణ చేయుచుండును. చిరకాలము తెనుగుదేశమునందుండుటచే నతడు తెనుగుగూడ చక్కగ మాట్లాడ గలడు. అతడు మూడుకాలముల యందుగూడ నదీస్నానము చేయును.

ఆనాటిసాయంకాల మాయనస్నానముచేసి కన్నులు మూసికొని కొంతసేపు సమాధి యం దుండెను. ఎదుట ప్రజ్వరిల్లుచున్న యగ్నితేజమువలె నాయన విశాలఫాలమునుండి బ్రహ్మతేజము వెలువడుచుండును. మొగము శాంతరసమును గ్రక్కుచుండెను. మూర్తీభవించిన యోగవిద్యవలె నాయన ప్రకాశింప జొచ్చెను. కొంతవడికిసమాధినుండి మేలుకొనెను. మేలుకొని కమండలమందలి కమ్మనిజలము త్రాగి యగ్నివైపు చూచుచుండెను. పురజనులలో నొకానొకభక్తుడొకనా డాయనకు నాలుగైదురూపాయలువెలగలకంచుపంచపాత్రనొక దానిని సమర్పించెను. తనకది యక్కరలేదని బావాజీ యెంతనొక్కి చెప్పినను, తీసికొనిపొమ్మని యెన్నిసారులు బ్రతిమాలినను భక్తుడు దానిని తీసికొనక యచ్చటనే యుంచెను. పాలు, పెరుగు మొదలైనవి తెచ్చి భక్తులాపంచపాత్రలో పోయుచుందురు. తులసీదాసు విధిలేక దధిక్షీరములను దానినుండి త్రాగుచుండును. తక్కినపనులకు తనకమండలమునేకాని దానినత డుపయోగింపడు. ఎవరో యొకరా కంచుపంచపాత్ర ననుదినము తెల్లగా తోమి పాకలో నుంచుదురు. ఆంధ్రదేశస్థులవలె నతడు దానిని పంచపాత్రయనక 'లోటా' యని వ్యవహరించుచుండును.

దామోదరయ్య మొట్టమొదట దురుద్దేశ్యమేమియు లేకయే వినోదార్థము పాక యెదుట నిలువబడియెను. నిలిచినతోడనే మండుచున్నయగ్నిహోత్రము వెలుగున తళతళ మెఱయుచున్న కంచులోటా యతనికంట

బడిపోయెను. వెంటనే యతనిమనస్సు మారి
పోయెను. దుర్వ్యసనపరాయణులకక్కుఱితికి
మేర యుండదుకదా? అప్పు డతడు మనస్సు
లో నిట్లు తలంచెను. "ఈలోటా నెట్లైన
నేను సంగ్రహింపనేర్చితినా నేటికి నాయక్కర
గడచును. ఇది నాలుగైదురూపాయల వెల



కుండును. చేతజిక్కిన
యెవరికైనా దీనిని విక్ర
యించి రెండు రూపా
యలు గుంజుకొని పోగ
లను. మావంటివారి
కాపద్బాంధవులై మే
ము దొంగలించి తెచ్చిన
దొంగవస్తువులను
తాము తక్కువ వెలకు
కొని మమ్ముద్ధరించి
భాగ్యవంతులై పెద్ద
మనుష్యులనిపించుకొని
తిరుగుచున్నమోసగాండ్రెందరో పట్టణమున
గలరు. వారు మాతలిదండ్రులు. వారున్నంత
కాలము మాకు డబ్బుకు లోటు లేదు. కాబట్టి
మేమున్నంతకాలము వారికి వస్తువులకు లోటు
లేదు. ఎవరో యొకరు దీనిని కొనకమానరు.
కాని యీయోగి మహానుభావుడని యందరు
చెప్పుకొనుచున్నారు. ఇతనిసొత్తు హరించుట
మంచిదా? నిజముగా నీతనిసొత్తు హరించుట
మే మంచిది. ఈయనకు బిడ్డలు లేరు, పెం
డ్లాము లేదు. ఇతడు పరమసన్న్యాసి. ఇతని
యనంతరము సొత్తు వాడుకొనువారు లేరు.
పెండ్లాము బిడ్డలుగలవారిసొత్తు దొంగిలించిన
పక్షమున వారు మిక్కిలి ఖేదపడుదురు. ఈ
యన జపములో నున్నాడా? మేలుకొన్నాడా?
కదలుట లేదు. మెదలుట లేదు. జపము చేయు
చున్నాడని తోచుచున్నది. ఇదే సమయము
లోటా లంకించుకొనిపోవుటకు." అని మన
స్సున వితర్కించుకొని నలుప్రక్కలు చూచి
మనుష్యు లెవ్వరు లేకపోవుటచేత నాపాక
ప్రవేశించి యడుగులచప్పుడు గాకుండ మెల్ల
మెల్లగా నడచి వంగి, యోరచూపుల యోగి
వైపుకు చూచుచు, మనకంచుపాత్రమీద
జేయివైచి యెత్తెను. బావాజీ సమాధినుండి
యదివరకే మేల్కాంచినందున నేదో యలు
కుడైన ట్లనుమానపడి యావంక చూచెను.
చూడగానే దామోదరయ్య లోటా యక్కడ
విడిచి పరుగెత్తిపోయెను. బావాజీ తత్క్షణమే
దిగ్గున లేచి లోటా చేతబట్టుకొని వానివెంట
బరుగెత్త నారంభించెను. పడుచువాడైన దా
మోదరయ్యతో సమానముగా ముసలి

వాఁడైన బావాజీ పరుగెత్తలేకపోయినను మొత్తముమీద కొన్నిగజములయెడముగా వారిరువురు పరుగెత్తుచుండిరి. బావాజీ నడుమ నడుమ "ఆవురే భేతా ఆవురే" యని కేకలు వైచుచుండెను. ఈలోపుగా నెదుటివైపునుండి నలుగురు మనుష్యులు వచ్చుచు విని పరుగెత్తుచున్న దామోదరయ్యను 'దొంగ దొంగ' యని పట్టుకొనిరి. వారిబారినుండి తప్పించుకొనిపోవుటకతడు కొన్ని ప్రయత్నములు చేసెను గాని యవి సఫలములు గాలేదు. వాఁడెంత గింజుకొన్నను వారు విడిచిపెట్టలేదు. 'దొంగ దొంగ' యని వారు మొదట నైచిన కేకల వలన చుట్టుప్రక్కలనున్న జను లనేకు లచ్చట గుంపులుగూడిరి. బావాజీయు వారిని గలిసికొనెను. దొంగవాఁ డందరకు లోకువగావున నింటదూరినకుక్కయట్లు దామోదరయ్యను గొందఱు మర్దింపసాగిరి. తులసీదాసు కొట్టవద్దని వారిని మందలించెను. 'దొంగవానిని గొట్టకపోయినచో వానికి బుద్ధివచ్చునా?' యని కొందఱు బావాజీ నడిగిరి. కొందరు పోలీసు ఠాణాకు వానిని బంపుమనిరి. ఎఱ్ఱపాగాల రాజభటు లచ్చటకుబోయి ఠాణాకు వాని దీసికొనిపోయి బంధింపఁజొచ్చిరి. కాని బావాజీ వారిని వారించెను. మఱియొకరు వారించినచో పోలీసువారు వారిమాట వినకపోయియుందురు గానితులసీదాసునెడలవారికిగల భక్తివిశేషముచేత దామోదరయ్యను వారు ఠాణాకుగొనిపోవరైరి. కొట్టనీయక ఠాణాకు గొనిపోవనీయక బావాజీ దొంగ నేమిచేయునని ప్రతిమనుష్యునకు సందియముదోఁచెను. కొందరు బావాజీని జూచి 'యితఁ డేమిదొంగిలించెనని' యడిగిరి. బావాజీ తన చేతిలోనిలోటాజూపి 'ఇదివీఁడెత్తికొనిపోవుటకు ప్రయత్నించెను. కాని నేను వానివైపు చూచుటచేత నచ్చట పాఱవైచి పరుగెత్తె"నని యతఁడు బదులుచెప్పెను. "మీసొత్తు పోలేదుగదా మీరతనినేల తఱుముకొనివచ్చితిరి. వానిని బట్టుకొని దండించినపక్షమున మీ కేమిలాభ" మని మఱికొందరడిగిరి. దామోదరయ్య ప్రశ్నోత్తరములను మిక్కిలి యాశ్చర్యముతో వినుచుండెను. చాలచోట్ల నతఁడు హస్తలాఘవముచేత ననేకవస్తువులను హరించి యప్పుడప్పుడు పట్టుబడుచువచ్చెను. గాని యీవిధముగా బాధింపవద్దనువారు, ఠాణాకు గొనిపోవద్దనువారు కనబడలేదు. పట్టుబడినపుడు పిడిగుద్దులు, చెంపకాయలు, తన్నులు, తిట్లు వాని కవిచ్ఛిన్నముగా లభించుచుండెడివి. ఇప్పు డవిలేకపోవుట మిక్కిలి వింతగానుండెను. అప్పుడు తులసీదాసు దామోదరయ్యదగ్గఱకు బోయి చేయిబట్టుకొని "నాయనా! యీ లోటాకొఱకై నీవెంతో కష్టపడి నాపాకము దర నెంతసేపో నిలచి మెల్లగాలోపలకు జేరితీసికొనబోయితివి. కాని నేను నీవైపుచూచుటచేత భయపడి పాఱిపోయితివి. ఇదిగో! నీవు దీనిని తీసికో. నాకు మంచికమండలమున్నది. కొబ్బరచిప్పలున్నవి. వద్దువద్దని నేను బ్రతిమాలినను నామాట త్రోసిపుచ్చి పాపమా వర్తకుడు నాయందు విశేషదయగలిగి దీనిని నిక్కడ బడవైచిపోయెను. నాకిదియక్కఱలేదు. నీకుగావలెను. కనుక నీవే తీసికొనుము. నాలుగైదు రూపాయల విలువగల యీలోటా నాకడ నుండుటచేత దీనిని రక్షింపవలసినభార మొకటి క్రొత్తగా నాపై

బడినది. ఇది నా హృదయమున లోభత్వము కలిగించుచున్నది. ఐహికవస్తువులతో నిది నన్ను బంధించుచున్నది. అందుచేత నిది నాకడ నుండగూడదు. అదియునుగాక యిది నాకడ నుండుటచేత నీవంటివారు రహస్యముగ వచ్చి నాపాకలో బ్రవేశించుటకవకాశము గలుగుచున్నది. నీవంటి తెలివితక్కువవాండ్ర నిది లోభపెట్టి వారికాపద తెచ్చుచున్నది. పరులకాపద తెచ్చునట్టి పదార్థములు మావంటివారికడ నుండగూడదు. కాబట్టి సర్వవిధముల చేత నిది నీవే తీసికొనిపోదగినవస్తువు. నేను కోపముతో మాట్లాడుట లేదు. ప్రసన్నభావముతోనే నీ కిది యర్పించుచున్నాను నీకు హాని చేయుటకై నేను తలంచుటలేదు. కాని నేను నీ కొక్కసలహా చెప్పుచున్నాను. దీనిని నీవు విక్రయించి త్రాగుడు నిమిత్తముగాని, వ్యభిచారము నిమిత్తముగాని యాధనము వినియోగించవద్దు. దాహము కలిగినప్పుడు పరమపవిత్రమైన గోదావరిజలము త్రాగుటకై దీని నుపయోగింపుము. నీపేరు మీదుగా నీయొద్దనిది నీవు బ్రతికియున్నంత కాలము నిలుపుకొనుము. ఇదిగాక నీకొక్కమాట చెప్పెద వినుము. నీవెవ్వడవో నేనెఱుగను గాని నీ ముఖవర్చస్సు చూడ సత్కులమునందు జన్మించినవాడ వని తోచుచున్నది. ఏలయీవిధముగా పాపము చేయుచున్నావు! ఈ బ్రతుకు శాశ్వతముగాదు. ఎప్పటికైనను మనము చావకపోము. మనపాపపుణ్యములు విచారించుటకు పరమేశ్వరుడున్నాడు. భగవంతునియెదుట యీపాపములకు నీ వేమిసమాధానము చెప్పెదవు? పరమేశ్వరుని పూజించుటకు నీచేతుల నుపయోగించవలెను కాని దొంగతనమునకు కాదు. ఈశ్వరనామామృతము పానముచేయుటకై నీనోరునుపయోగించవలెనుకాని త్రాగుటకుగాదు. బిడ్డా! నీవు బాగుపడుము. ఇకమీద పాపము చేయకుము. భగవంతుఁడు నిన్ను మంచి మార్గమునకు మఱల్చుగాక." అని ప్రసంగము చాలించి దామోదరయ్య తలమీద చేయివైచితట్టియూరకుండెను దామోదరయ్యకన్నులనుండి జొటజొట బాష్పములు రాలజొచ్చెను. దొంగిలించినసొత్తు దొంగవానికే సమర్పించుట యాదివరకెవ్వరు నెన్నఁడు కనిగని వినినది కాదు. కావున బావాజీయొక్క యుదారభావమునకు నచ్చట జేరినవారందఱు మిక్కిలి యాశ్చర్యపడి యతని యుపదేశవాక్యములను భక్తితో విని యానందించిరి. బావాజీ దామోదరయ్యకు లోటా నీయబోయెను. దామోదరయ్య దానిని గ్రహిం



పక యేడ్చుచు బావాజీ పాదముల పైబడి "స్వామీ! లోటా నాకు వద్దు. రక్షింపుడు రక్షింపుడు. బుద్ధి వచ్చినది. బుద్ధి వచ్చినది. నే నిక పాపము చేయను. నాకాలుబిడ్డలు లేరు. ఇక మీశిష్యుఁడనై మీపాదసేవ చేయుచుండెదను. అందుకు నన్ననుగ్రహింపుడు." అని యడుగులమీదనుండి లేవకపోయెను. బావాజీ వానిని బుజ్జగించి లేవనెత్తి "బిడ్డా! నీవు బాగుపడునట్లు, పాపముచేయనట్లు నే డిచ్చట చేరినజనులయెదుట చెప్పుచున్నావు. కనుక నిన్ను నేను శిష్యునిగా దీసికొనుచున్నాను. నీకు గాఢమైనపశ్చాత్తాపము గలిగినదని నమ్ముచున్నాను." అని జనులవంక దిరిగి "బిడ్డలారా! చెడుత్రోవలకు బోయెడువారిని కొట్టి తిట్టి శాధించినందున లాభము లేదు. దయారసము ప్రవహింపచేసినచో వారిమనస్సునందలి పాపపంకము కొట్టుకొనిపోవును. ఇదే తార్కాణము." అని వారినందరి వారివారి యిండ్లకు బొమ్మని యానతిచ్చి దామోదరయ్యను తనవెంట పెట్టుకొని తననివాసమునకు బోయెను త్రోవలో దామోదరయ్య బావాజీతో నిట్లు విన్నవించెను. "మహాత్మా! నేను బ్రాహ్మణుడను. నాతండ్రి యీపట్టణములో న్యాయవాది. చిన్నప్పుడు దుస్సహవాసములు చేసి చదువుకొనక త్రాగుబోతుతన మలవాటు చేసికొని చెడిపోయితిని. త్రాగివచ్చి నేను కొట్టెడుదెబ్బలు తినితిని నాభార్య కాలధర్మము నొందెను. ఒకకుమారుఁడు కలిగినాడుకాని పాపకర్ముడనైన నాకడ బ్రతికియుండుటకంటె బరమపతివ్రతయైన తల్లికడ నుండుటయే మంచిదనికాబోలు వాడుకూడ మరణించెను. బ్రతికియున్నంతకాలము నాతల్లి నాచేత నిరంతరము తిట్లు, కొట్లు పడి యెన్నిపాట్లు పెట్టినను కడుపుతీపిచేత నాకింత గంజికాచిపోసి నన్ను రక్షించెను. ఆమెయు లోకాంతరవాసినియైనది. ఇప్పుడు నేను నిరాధారుడను. ఏకాకిని. ఆస్తియంతయు విక్రయించి త్రాగితిని. ఇప్పుడన్నవస్త్రములు లేవు. ఎంగిలినుండి నీకడకునైన రమ్మనెడు దిక్కు లేదు. త్రాగుటకై ధనమునిమిత్తము నేనుచేయనిపాపము లేదు. నేను త్రాగుబోతును; జూదరిని; చోరుడను; జారుడను; హంతకుడను; నిత్యమసత్యవాదిని. నేనుజేయనిపాపము లేదు. మీచరణములే నమ్ముకొంటి. ఈగౌతమీనది సాక్షిగా, మార్కండేయస్వామి సాక్షిగా, గోపాలస్వామిసాక్షిగా, నే నికమీఁద నేపాపము జేయనని మఱియొకమారు శపథము చేయుచున్నాను. పోలీసువారి లాఠీపోటులకంటె, మేజస్ట్రీటులు కొట్టించిన కొరడాదెబ్బలకంటె మీపలుకులు లెక్కువతీవ్రములై నన్ను మంచిమార్గమునకు మఱల్చినవి." ఈమాటలు ముగియునప్పటికి వారు పాకజేరిరి. నిర్భాగ్యదామోదరుడైన దామోదరయ్య పశ్చాత్తాపముచేత నిక్కలి పరిశుద్ధుడై భక్తిశ్రద్ధలతో బావాజీని సేవించుచు పరిశుద్ధముగా జీవయాత్ర గడపెను. పాపరోగములను హరించుటకు పశ్చాత్తాపమువంటి యౌషధము మఱియొకటి లేదుగదా!